క్లుప్తంగా

విద్యాభివృద్ధికి సహకారం



విద్యార్థినులకు ఉపకార వేతనాలు, సైకిల్ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా విద్యాభివృద్ధికి సహకరిస్తున్నామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని కార్యాలయంలో సోమవారం ట్రస్ట్ ద్వారా రూ.లక్ష ఉపకార వేతనాలను అందజేశారు. ఇంజినీరింగ్ విద్యార్థిని పి.ఐశ్వర్య, ఇంటర్ విద్యార్థినులు తారకదేవి, అపర్ణ, పి.సూర్య తేజశ్విని, 6వ తరగతి విద్యార్థిని గౌరీలకు ఉపకార వేతనాలు, 8వ తరగతి విద్యార్థి భువనేశ్వరికి సైకిల్ అందజేశారు. వీటిని వేదుల మధుసుదన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ సీమకుర్తి పాపారావు, రమణామూర్తి, జగన్నాథరావు, అరుణ్‌కుమార్ రామచరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు గుర్రం జాషువా



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బోట్‌క్లబ్ వాకర్స్ సంఘ సభ్యులు

కాకినాడ రూరల్: సమాజ చైతన్యం కోసం రచనలు చేసిన అక్షర యోధుడు గుర్రం జాషువా అని పలువురు కొనియాడారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, వీరాచార్యులు, సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్య లోకంలో ప్రజ్వలించిన తేజోమూర్తి జాషువా అని అన్నారు. అనంతరం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని జరిపారు. గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకూ సబ్ జూనియర్స్ విభాగంలో బాలుర, బాలికల క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని సంఘ కార్యదర్శి కె.రాజేష్ సోమవారం తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలోని ఫుట్‌బాల్ ఫీల్డ్‌లో ఎంపికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31 మధ్య పుట్టిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 83286 43876 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

కాటన్ చిరస్మరణీయుడు



జి.భావారంలో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

కరప: ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి, జిల్లాను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్‌దొర చిరస్మరణీయుడని సర్పంచ్ రొక్కాల గణేష్ అన్నారు. జి.భావారంలో సోమవారం కాటన్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉభయగోదావరి జిల్లాల్లో రెండు పంటలు పండుతున్నాయంటే కాటన్‌దొర చలవేనన్నారు. మాజీ సర్పంచ్ సుందరపల్లి సత్యనారాయణ, చిట్టూరి గంగయ్య, ఆకుల గంగారావు, గరగ బూరయ్య, గొల్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ కళాశాలలో జాబ్‌మేళా

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం దివీస్ ల్యాబ్ కంపెనీ జాబ్ మేళా నిర్వహించింది. డిగ్రీ ఆఖరి సంవత్సర సైన్స్ విద్యార్థులు 361 మంది హాజరు కాగా 260 మంది ఉద్యోగాలు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఏలియా, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ సోమరాజు అభినందించారు.

బాధితులకు న్యాయం చేయాలి

కాకినాడ సిటీ: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్, జిల్లా పరిషత్ సెంటర్ల వద్ద ధర్నా నిర్వహించారు. బాధితుల బాండ్ల రూపంలో ఉన్న సొమ్మును చెల్లించాలని అన్నారు. సీపీఐ నాయకులు తాటిపాక మధు, తోకల ప్రసాద్, అసోసియేషన్ నాయకులు వై.నాగలక్ష్మి, వీరమణి, బొమ్మేటి రాంబాబు పాల్గొన్నారు.

ఆవును... ఇబ్బందే!

- రోడ్లపై పశువుల తిష్ట
- ప్రమాదాల బారిన ప్రయాణికులు



విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల ప్రధాన రహదారి మధ్యలో తిష్టవేసిన పశువులు



ఎల్‌బీనగర్ నుంచి జేఎన్‌టీయూకేకి వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో..

బోట్‌క్లబ్: చూడచక్కని దారులు.. హాయిగొలిపే ప్రయాణానికి మార్గాలు.. ఇంత బాగున్న రోడ్లపైనా ఇబ్బందే. ఎక్కడికక్కడ ఆగాల్సిందే. అదేంటి అంటారా!.. రోడ్లపై నడిచే స్పీడ్ బ్రేకర్లు, అదేనండి పశువులతో వచ్చిన చిక్కు ఇది. ఒకటి, కాదు రెండు కాదు పదుల సంఖ్యలో పశువులు రోడ్లపై తిష్ట వేస్తున్నాయి. ప్రజలు, వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. వేళాపాళా లేకుండా ఇవి రోడ్డుపైనే ఉండడంతో అటువైపు వెళ్లే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాకినాడలో సుమారు ఐదు లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకూ వివిధ పనులపై బయటకు వెళ్తుంటారు. అలాగే జిల్లా కేంద్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. స్మార్ట్ సిటీ పుణ్యమా అని రోడ్లు సుందరంగా తయారైనా పశువుల కారణంగా హాయిగా సాగే ప్రయాణం చిక్కుల్లో పడుతుంది. నిత్యం ఏదొక వీధిలో ఆవులు మకాం వేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భానుగుడి సెంటర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో ఎల్‌బీ నగర్, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది.

బీభత్సం సృష్టిస్తూ..

పశువులు రోడ్లపై తిష్ట వేయడమే కాదు ఒక్కసారిగా వాటిలో అవే పోట్లాడుకుంటూ బీభత్సం సృష్టిస్తున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులపై పడడంతో వారు గాయాల పాలవుతున్నారు. ఇటీవల విద్యుత్‌నగర్ ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కళాశాలకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా రోడ్డుపై పశువులు ఒక్కసారిగా గుంపుగా వచ్చి ఆ వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో ఆ ఇద్దరు విద్యార్థులూ గాయాల పాలయ్యారు. ఇలా నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుపైకి పశువులను వదిలితే చర్యలు తప్పవని కార్పొరేషన్ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరిన్నా వాటి యజమానుల్లో మార్పు రావడం లేదు. పశువులను పట్టుకుంటే మాత్రం ఈ సారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పి వెళ్లి మళ్లీ యథాతథంగా రోడ్డుపైనే వదులుతున్నారు. ఇదిలా ఉంటే నగరంలో కార్పొరేషన్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు భారీగా మొక్కలను పెంచుతున్నాయి. మొక్కలు ఏపుగా పెరుగుతున్న సమయంలో వాటిని పశువులు తినేడంతో పచ్చదనం ఆవిరవుతోంది. అపార్టుమెంట్‌ల్లోకి చొరబడి ఇబ్బంది పెడుతున్నాయని పలువురు అంటున్నారు.

అడ్డుగా ఉంటున్నాయి



నేనే విద్యార్థులను ఆటోలో కళాశాలలకు తీసుకు వెళ్తుంటాను. నిత్యం ఏదో రోడ్డుపై ఈ పశువులు దర్శనమిస్తున్నాయి. ఒక్కోసారి రోడ్డుపై ఆటో కూడా వెళ్లే వీలు లేకుండా అడ్డుగా ఉంటున్నాయి. వాటిని చెదరగొట్టి రోడ్డుపై వెళ్లాల్సి వస్తోంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– టి.కృష్ణ, ఆటోడ్రైవర్

భయం భయంగా..



రోజూ ఐడియల్ కళాశాలకు విద్యుత్‌నగర్ ప్రధాన రహదారి నుంచి వెళ్తుంటాం. ఒక్కోసారి నాన్సీ స్ట్రీట్‌లో ప్రయాణిస్తుంటాం. ఈ రెండు రహదారుల్లో ఏదోక చోట తప్పనిసరిగా పశువులు సంచరిస్తుంటాయి. చాలా ఇబ్బందిగా ఉంటుంది. ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే భయమేస్తోంది.

– కె.సాయి, విద్యార్థి

ఇద్దరికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ వివిధ కారణాలతో ఇద్దరు మరణించగా, ఆయా కుటుంబాల్లో సభ్యులకు సోమవారం కారుణ్య నియామకాలు కల్పించారు. సోమవారం వారికి ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ కృతికా శుక్లా అందజేశారు. ఒకరికి సచివాలయంలో గ్రామ మహిళా పోలీస్, మరొకరికి ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగాలు ఇచ్చినట్లు కలెక్టర్ వివరించారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో ఉచిత సేవలు



వేములవాడలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. వేములవాడ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆదాయ, నివాస, కుల, ఆధార్ సేవలు, కౌలు గుర్తింపు కార్డులు వంటివి అందిస్తున్నామన్నారు. వేములవాడ, వలసపాకల పరిధిలోని 235 మందికి సర్టిఫికెట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు కమిడి మంగాదేవి, వాసంశెట్టి రామారావు, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, నాయకులు కమిడి శంకర్, బండే వీరబాబు, వజ్రపు కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఖైదీ మృతదేహం పరిశీలన

కాకినాడ క్రైం: డెంగీతో కాకినాడ జీజీహెచ్‌లో రాజమహేంద్రవరం కేంద్ర కారాగార ఖైదీ బొట్ల వీరాంజనేయులు మృతిచెందిన విషయం తెలిసిందే. అతని మృతదేహాన్ని ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. వీరాంజనేయులుకు అందిన వైద్య సేవలపై ఆరా తీశారు. ఆర్డీవో వెంట ఎస్‌ఐ చిరంజీవి తదితరులు ఉన్నారు.

యు-విన్ యాప్ వినియోగంపై శిక్షణ

కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో యు-విన్ యాప్ నిర్వహణపై శిక్షణా కార్యక్రమం సోమవారం జరిగింది. వైద్యాధికారుల కోసం నిర్వహిస్తున్న ఈ శిక్షణ మంగళవారం కూడా కొనసాగనుంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఐఓ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ యు-విన్, మిషన్ ఇంద్రధనుష్-5.0 కార్యక్రమాల నిర్వహణ సమర్థవంతంగా జరగాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల నిర్వహణకు యాప్ విధానం ఎంతగానో సహకరిస్తుందన్నారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి జిల్లాలో ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0 మూడు దశల్లో కొనసాగనుందన్నారు. సమావేశంలో యూఎన్‌డీపీ రాష్ట్ర అధికారి డాక్టర్ కమలాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వాన దడదడ



నడకుదురు సాయిబాబా మందిరం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



కాకినాడ రూరల్‌లో దమ్ముల పనులు

- జలమయమైన వీధులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

కరప: రెండు రోజులుగా వాన దడదడలాడిస్తుంది.. కరప మండలంలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో పలు గ్రామాల్లోని వీధులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడకుదురు, కరప, వలసపాకల, గురజనాపల్లి, గొడ్డటిపాలెం, వేళంగి తదితర గ్రామాల్లోని మెయిన్ రోడ్లు, కాలనీలు, శివారు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. కరప, కూరాడ, నడకుదురు తదితర గ్రామాల్లోని పాఠశాలల క్రీడా ప్రాంగణాల్లో నీరు నిలబడి చిత్తడిగా మారింది. డ్రైయిన్లకు అవుట్‌లెట్‌లు లేక నీరు వెళ్లకపోవడంతో సమస్య ఎదురవుతోంది. కరప ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ వద్ద నీరు నిలిచిపోయింది. వలసపాకల ప్రాథమిక పాఠశాల ఎదురుగా అదే పరిస్థితి.

సాగు పనుల్లో బిజీ

కాకినాడ రూరల్: ముసురుతో వానలు పడుతుండడంతో రైతన్నలు ఖరీఫ్ సాగు పనులలో నిమగ్నమయ్యారు. మండలంలో రైతులు వెదజల్లు కోసం ట్రాక్టర్లతో దమ్ములు ప్రారంభించారు. కాలం అనుకూలంగా ఉండడంతో సాగు పనుల్లో రైతులు బిజీ అయ్యారని మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తెలిపారు.

మణిపూర్ ఘటనపై శాంతియుత ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న రిక్కీ గూటం

కాకినాడ రూరల్: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలను నిరసిస్తూ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ పెద్దలు జోసెఫ్ బెన్నీ, శామ్యూల్ సాగర్, రిక్కీ గూటం తెలిపారు. రమణయ్యపేట వైద్యనగర్‌లోని బెరాక బ్లెస్సింగ్ చర్చిలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. భానుగుడి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి సమర్పిస్తామని వారు తెలిపారు. క్రైస్తవులంతా ర్యాలీలో పాల్గొనాలని కోరారు. మణిపూర్‌లో 249 క్రైస్తవ మందిరాల దహనం, కూల్చివేత, బలహీన తెగలు, క్రైస్తవులను అడవుల నుంచి తరిమివేయడం వంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు.

ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం



ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని వివిధ విభాగాధిపతులను ఆయన ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పెన్షన్, ఇంటి స్థలాల కోసం వినతులు వచ్చాయన్నారు. ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాసరావు, కె.హరిదాసు, డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలసిన డీఎఫ్ఓ

జిల్లా అటవీశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.భరణి సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాలను మర్యాద పూర్వకంగా కలిశారు. రంపచోడవరం సబ్ డీఎఫ్ఓగా పనిచేస్తూ ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు.

- డివిజనల్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బోట్‌క్లబ్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 వరకూ నుంచి డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 8 మంది ఫోన్ చేసి వారి సమస్యలను కమిషనర్ మహేష్‌కుమార్‌కు వివరించారు. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వివరించారు. సమస్యలపై 0884 2357800 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. అడిషనల్ కమిషనర్ నాగనరసింహారావు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోటలో భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే రద్దీ నెలకొంది. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. తరువాత అభిషేకాలు జరిపారు. భక్తులకు దేవస్థానం తరఫున అన్నసమారాధన నిర్వహించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది సేవలందించారు. పూజల అనంతరం మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

వలంటీర్లకు వందనం — చేదోడుగా ఉంటూ.. సేవలందిస్తూ..



జెడ్.భావారంలో పింఛన్ ఇచ్చేందుకు లావణ్య వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ మల్లిక

కరప: సంక్షేమ సారథులు వలంటీర్లు. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉంటూ పథకాల అమలుకు కృషి చేస్తున్నారు. జెడ్.భావారంలో వలంటీర్‌గా బుంగ మల్లిక పనిచేస్తున్నారు. తనకు కేటాయించిన కుటుంబాలకు చేదోడు, వాదోడుగా ఉంటూ సేవలందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, సచివాలయ సేవలను వివరిస్తూ అర్హులకు న్యాయం జరిగేలా చూస్తున్నారు. తన పరిధిలోని మంజేటి లావణ్యకు అమ్మ ఒడి, వైఎస్సార్ బీమా, ఇంటి పట్టా వచ్చేలా చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుకలో పింఛన్ రాయించి ప్రతినెలా ఒకటో తేదీనే సొమ్ము అందజేస్తున్నారు.

ఇంటి స్థలం వచ్చేలా..

సొంతిల్లు లేక బాధపడుతుంటే వలంటీర్ మల్లిక ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. తర్వాత ఇళ్ల స్థలం మంజూరైందని చెప్పి రూ.6 లక్షల విలువచేసే ఇంటి పట్టా చేతిలో పెట్టారు. ప్రతినెలా మొదటి తేదీనే తలుపు తట్టి పింఛన్ సొమ్ము చేతిలో పెడుతున్నారు. ఇంతవరకూ రూ.8.14 లక్షల ప్రయోజనం కల్పించారు. వలంటీర్ మా కుటుంబానికి అండగా ఉంటున్నారు.

-మంజేటి లావణ్య, జెడ్.భావారం

జిల్లా అటవీ శాఖాధికారిగా భరణి



కలెక్టర్ కృతికా శుక్లాకు మొక్కను అందజేస్తున్న భరణి

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.భరణి సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆమె మొక్కను అందజేశారు.

ఓటర్ల సర్వే పారదర్శకంగా చేయాలి

నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్బారావు



ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సుబ్బారావు

పిఠాపురం: ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేయాలని కుడా చైర్మన్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్బారావు సిబ్బందికి సూచించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ఇంట్లో ఓటర్లు ఎంత మంది ఉన్నా వారందరి వివరాలు పూర్తిగా ఆధారాలతో సేకరించాలన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే కుటుంబ సభ్యుల సమక్షంలో సరి చేయాలన్నారు. ఎక్కడా తేడాలు రాకుండా పారదర్శకంగా, పక్కా పూర్తి వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ



జిల్లా స్థాయి యోగా పోటీల్లో సిల్వర్ మెడల్ అందుకుంటున్న యశ్వంత్

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కిలాడి యశ్వంత్ జిల్లా స్థాయి యోగా పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం కాకినాడ జేఎన్‌టీయూలో నేషనల్ యోగా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో సిల్వర్ మెడల్ సాధించి వచ్చే నెలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు యశ్వంత్ అర్హత సాధించాడన్నారు. విజేతను మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ జె.రామారావు, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఎనిమిది మందికి జరిమానా

సామర్లకోట: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో కోర్టు ఎనిమిది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి తనిఖీలు చేయగా సామర్లకోటకు చెందిన ముగ్గురు, పెద్దాపురానికి చెందిన ఇద్దరు, రామచంద్రపురం, జొన్నాడ, ఆర్బీపట్నంకు చెందిన ఒక్కొక్కరిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అదుపులోకి తీసుకున్నామన్నారు. సోమవారం కాకినాడ కోర్టులో హాజరు పరచగా పైవిధంగా జరిమానా వేశారన్నారు.

సాగర తీరం.. సుమనోహరం



ఉప్పాడ తీరంలో కనువిందు చేస్తున్న కెరటాలు

పిఠాపురం: ఆకాశం నుంచి అప్పుడే కిందకు దిగుతున్న మేఘాలు కనీకనిపించని సూరీడు మధ్య పుడమిని పట్టుకుందామన్నట్టుగా నీలి సంద్రం ఎగసిపడుతుంటే ఆ రెండిటికీ మధ్య పాల పొంగు లేచినట్టు తెల్లని కెరటాలు కనువిందు చేశాయి. అల్పపీడనం ప్రభావంతో సోమవారం వాతావరణం కూల్‌కూల్‌గా ఉంది. ఉప్పాడ సాగర తీరంలో చిన్న చిన్న చినుకులు పడుతుంటే కడలి ఉరకలేస్తూ కెరటంగా వచ్చి ఒడ్డుకు చేరే లోపు నీలి రంగు కాస్తా తెల్లని పాల్లవెల్లువలా మారుతూ చూపరులకు కనువిందు చేసింది. చల్లని వాతావరణంలో సాగర తీరం మనోహరంగా కనిపించింది.